

# గీటురాళ్ళు

– కె.ఇందిర

"ఈ రోజు రెండో తారీఖు. పాపకి పోలియో డ్రాప్స్ వేయించాలి. పనిమనిషికి జ్వరం. ఈరోజు రాదుట. మీరు సాయంత్రం కాలేజీ నుంచి రాగానే పాపను డాక్టరు దగ్గిరకు తీసుకు వెళ్ళాలి." రఘుకు షూస్ అందిస్తూ అంది పద్మ.

"నీకు పోయిన సారే చెప్పాను. టి.వి.లో చూపించినట్లు నీవెంటబడి రానని. ఆ ఏడ్పేదో నువ్వే ఏడు. నుదుట రాసి పెట్టివుంటే నువ్వు డ్రాప్స్ వేయించినంత మాత్రాన రోగం రాకుండా వుంటుందా? ఇప్పుడు కుంటి, గుడ్డి, మూగవాళ్ళకి మంచి ఫ్యూచర్ వుంది. గవర్నమెంట్ జాబ్ దొరుకుతుందిలే." వెటకారంగా అన్నాడు రఘు.

"లేదు మీరు రాకపోతే ఫరవాలేదు. డబ్బులివ్వండి. ఆటోలో వెళ్ళి పాపకు డ్రాప్స్ వేయిస్తాను."

"ప్రక్క వీధిలో వున్న డాక్టరు దగ్గిరకు ఆటోలోనే వెళ్ళాలి కాబోలు మహారాణిగారు. ఏం చేస్తాం. నిన్ను కట్టుకుంది నా డబ్బుపోవడానికేగా. నీ కోసమని వంటింట్లో నీళ్ళపంపు. ఓవర్ హెడ్ ట్యాంక్ వున్న ఇంటికి పన్నెండు వందలు వదిలించుకుంటున్నాను. పాపకి నీళ్ళు పోయడానికి పనిమనిషికి ఏభై రూపాయలు ఇస్తున్నాను. సరే ఈ పాతిక వుంచుకుని ఆటోలో పోయి ఏడు."

పద్మ చేతిలో నోట్లు పెట్టి విసురుగా బయటకు వెళ్ళాడు రఘు. పొంగివస్తున్న ఏడుపును ఆపుకుంటూ వంటింట్లోకి వెళ్ళింది పద్మ. రఘుకు టిఫిన్ బాక్స్ ఇవ్వడం మర్చిపోయింది. బస్‌స్టాప్ ఎంతో దూరంలేదు. ఒక పరుగులో ఇచ్చి రావచ్చు. కానీ తనకా అదృష్టంలేదు. తన వంకర బడ్డ అవిటి కాలును చూస్తూ వంటింట్లో కుప్పలా కూలబడింది పద్మ.

"క్షమించు బావా, ఈ రోజు పస్తుంటావు. నాలాంటి కుంటిదాన్ని చేసుకొని నువ్వేం సుఖపడుతున్నావు. భగవాన్! ఇలాంటి రోగం ఇచ్చి నన్నెందుకు అశక్తురాల్ని చేశావు? నానుంచి ఎవరికీ సుఖ సంతోషాలు లేవు."

పాప ఏడుపు విని నెమ్మదిగా లేచి రూములోకి వెళ్ళింది. చాప ప్రక్కనే కూర్చొని పాపని ఒళ్ళోకి తీసుకుంది.

ఈ రోజు ఎలాగైనా సరే పాపకు డ్రాప్స్ వేయించాలి. వచ్చే నెల కూడా వేయిస్తే మూడు సార్లు అవుతుంది. తరువాత పోలియో వస్తుందన్న భయం వుండదు. ఎంత భయంకరమైన రోగం అది. పసిపిల్ల భవిష్యత్తంతా బూడిద పాలు చేస్తుంది. అడుగడుక్కీ తమచేత కానితనం వెక్కిరింప చేస్తుంది. జీవితాన్ని నవ్వుల పాలు చేస్తుంది. జీవితాంతం చేదు అనుభవాల్ని రుచి చూపిస్తుంది.

ఇంకొకరి దాకా ఎందుకు? తాను అనుభవించడంలా ఆ చేదు జీవితాన్ని. ఊహ తెల్సినప్పటి నుంచి 'అవిటి పిల్ల', 'కుంటి పద్మ' అనిపించుకుంటూ ఆడుతూ, పాడుతూ, పరుగులు తీసే పసితనాన్ని పడుతూ, లేస్తూ, ఈడుస్తూ, ఏడుస్తూ గడిపింది.

బడికి వెళితే ఏదో బిడియం. ఏదో తప్పు జరిగిందనే భావన. అందరు పిల్లల్లాగా తనూ ఆటలాడబోయి, క్రిందపడి కాళ్ళు చేతులు పేక్కుపోయి ఏడుస్తూ క్లాసుకు వెళ్ళేది.

ఊహ తెలియని పిల్లలు, "కుంటికులాసం, ఇంటికి మోసం." అని ఎగతాళి చేస్తూంటే, వెర్రి దానిలా చూస్తూ వాళ్ళను వెక్కిరించేది. టీచర్లకు ఫిర్యాదు చేసేది.

హైస్కూలు, యూనివర్సరీ కి పిల్లలందరూ గేమ్స్‌లో పాల్గొంటే తాను ఒకమూల కూర్చొని, తన అవిటి కాలిని గిచ్చుతూ ఉక్రోషంతో భగవంతుడ్ని తిట్టేది.

యానివర్సరీ రోజున ఆడపిల్లలు స్టేజి మీద డ్యాన్సులు, డ్రామాలు వేస్తూ వుంటే తనకా అదృష్టం లేదని కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ, స్టేజికి దగ్గిరగా కూర్చొని ఆశగా వాళ్ళతో పాటు తనూ డ్యాన్స్ చేస్తున్నట్లు ఊహించుకునేది.

సంక్రాంతి రోజుల్లో 'సంజె గొబ్బెమ్మ' పేరంటానికి వెళ్ళి ఆడపిల్లలంతా గొబ్బితట్టుతూంటే, గుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ కుర్చీ మీద కూర్చొని చూస్తుండేది.

తాను పెద్ద పిల్ల అయినప్పుడు 'అవిటి పిల్ల' దీనికి పెళ్ళి ఎలా అవుతుంది అని అంతా అంటుంటే అమ్మ కన్నీళ్ళు పెట్టుకునేది. 'నన్ను నీదగ్గిరే బ్రతకనీయమ్మా' అంటూ ఏడ్చింది తను.

టెన్త్ క్లాస్ పాసయిన తరువాత ఇంటర్‌లో చేరింది. కాని, కాలేజీ పిల్లల కామెంట్స్ తట్టుకోలేకపోయింది.

'నిలువవే వాలు కన్నుల దానా, వయ్యారి కుంటి నడకదానా"

హీరో నాగేశ్వర్రావు ననుకొని ఒక చదువురాని జీరో తన వెనకాల పాడుతుంటే, తన అవిటితనాన్ని మర్చిపోయి వాడ్ని తప్పించుకోవాలనే ధ్యాసలో మెట్లు గబగబా దిగింది. కుప్పలా మెట్లమీద పడింది. మోకాలికి బలంగా దెబ్బతగిలింది. లేవలేకపోయింది. కొంతమంది హేళనగా నవ్వారు. ఆడపిల్లల సహాయంతో ఇంటికి వచ్చింది పద్మ.

"భగవాన్ అందరిలో నన్ను నవ్వుల పాలు చేయ డానికేనా పుట్టించావు. నాలాంటి వాళ్ళు గ్రుడ్డి, మూగ, నత్తి మేమందరం బపూన్లమా? మేము పుట్టింది నవ్వించడానికా?" కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

మోకాలి మీద గాయం మానడానికి నెల రోజులు పట్టింది. కాని మనసులోని గాయం మానలేదు. కాలేజీకి వెళితే ఆగాయం రేగుతుందే కాని మానదు. కాలేజీ చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టింది పద్మ.

'కాకిపిల్ల కాకికి ముద్దు' అలానే తాను తన తల్లికి ముద్దుల కూతురు. ఆమె కంటికి తను ఒక హంస. పద్మాక్షి. పాతికేళ్ళు గుండెల్లో దాచుకుంది ఆ తల్లి. రెండు మూడు సంబంధాలు వచ్చాయి కానీ, తన అవిటి కాలు చూసి వెనక్కుపోయాయి. తనకంటే ముందు, చెల్లికి పెళ్ళయింది. ఏదైనా ఉద్యోగంలో చేర్పిద్దామనుకున్నారు. కాని అందరిలా తాను పరుగులెత్తే బయట ప్రపంచంతో పాటు పరుగెత్తలేదు. ఆ కాంపిటీషన్‌లో తాను

పరుగెత్తబోయి క్రిందపడి వున్న మంచి కాలో, చేతులో విరగ్గొట్టుకుంటుందన్న భయం తల్లి దండ్రులకు.

మేనత్త మనస్తాపం చూడలేక, స్వతహాగా జాలిగల రఘు, తనని పెళ్ళి చేసుకుందుకు ఒప్పు కున్నాడు. ఉన్నంతలో బాగానే ముట్టచెప్పి ఘనంగా పెళ్ళి చేశారు. రఘు విజయవాడలో కాలేజీ లెక్చ రర్. తను నీళ్ళు మోయలేదని, నీళ్ళ సౌకర్యం వున్న ఇల్లు అద్దెకు తీసుకున్నాడు.

కొత్తగా పెళ్ళయిన దంపతుల్లా తామిద్దరూ, షికార్లకని, సినిమాలకని, పార్టీలకని, ఫ్రెండ్స్ ఇళ్ళకనితిరగలేకపోయారు. తానుకుంటుకుంటూ రఘు ప్రక్కన నడవడం అతనికి అవమానకరమేమోనని భావన ఏర్పడింది. బస్సుల్లో తోసుకుని, ఎక్కలేక పోయేది. 'ఆటో' తప్ప గత్యంతరం లేదు. దాంతో రఘుకు కొంచెం చికాకనిపించింది. తొందరపడి, ఏదో త్యాగం చేయబోయి ఒక కుంటిదాన్ని పెళ్లి చేసుకొని వైవాహికపు జీవితంలోని మధురిమను పోగొట్టుకున్నానేమో అనే భావన రఘులో కన్పించసాగింది. నెమ్మది నెమ్మదిగా రఘుకు పద్మ మీద జాలి పోయి చికాకు, ఏహ్యం ఏర్పడసాగాయి.

ఇంటిపనిలో, వంటపనిలో ఏ చిన్న తప్పు కన్పించినా "నీకు పోలియో కాలికి వచ్చింది కాని, చేతికి, మెదడుకు కాదుగా. ఏం రోగం, ఏ పని చాత కాదు. ఆలోచించడం చాత కాదు" అంటూ చీటికి మాటికి, చికాకు పడుతూ ఎద్దేవా చేయసాగాడు.

మూగగా రోదించేది పద్మ "భగవాన్ ఈ పోలియో వల్ల దాంపత్య జీవితం కూడా కుంటు పడింది. రోజుకొక చేదు అనుభవాన్ని ఎదుర్కొన వలసి వస్తోంది."

రెండేళ్ళ తరువాత తన కడుపు పండింది. అయిదవ నెలలోనే పుట్టింటికి వెళ్ళింది. నిండు చూలాలుగా వున్నప్పుడు భారం మోయలేక రెండు మూడు సార్లుపడింది. చావు తప్పి కన్నులొట్ట పోయినట్లు, ఆడపిల్లను కని బ్రతికి బయటపడింది. మళ్ళీ ఇంకోసారి ఇలానే పడితే పెద్ద ప్రాణానికే ముప్పని ట్యూబెక్టమీ చేయించారు. పద్మ మీద ఇష్టం పోయిన రఘుకు, పిల్లమీద కూడా ఇష్టం పోయింది. ఒక్క పిల్ల చాలనుకొని ఆపరేషన్‌కి ఒప్పుకున్నాడు. కాని అత్తగారు మాత్రం వంశాంకురం పుట్టలేదని పద్మ మీద గుర్రు మంటుంది.

పోలియో వల్ల తల్లిగా కొన్ని పనులు నిర్వర్తించ లేకపోయింది. అందరిలా పసికందును అక్కున చేర్చుకొని నడవలేదు. కాళ్ళమీద పడుకోబెట్టుకొని 'ఉగ్గు' పోయలేదు. లాలపోయలేదు. పాపకి స్నానం చేయించాలంటే పని మనిషి రావాల్సిందే. ఊయలలోంచి పాపను దించలేదు. పుట్టింటి నుంచి రాగానే పాపకు ఊయల కరువైంది.

తన జీవితం ఇంతే. ఒక అవిటి పిల్లగా, భార్యగా, తల్లిగా ముందు ముందు అవిటి అత్తగారిలా, కుంటి అమ్మమ్మలాగా గడపాల్సిందే.

బాధతో నిట్టూర్పు విడిచింది పద్మ. పాపకి తడిబట్టతో తుడిచి స్నానం చేయించాలను కుంది.

ఇంతలో పక్క పోర్షన్‌లో నున్న పార్వతమ్మ గారు వచ్చింది. "పద్మా, అబ్బాయి చికాకులు విన్నానులే. పాపకి నీళ్ళు నేను పోస్తాను. నువ్వు దిగులు పడకు. పాపను ఎత్తుకుంటాను. ఇద్దరం కలసి డాక్టరమ్మ దగ్గిరకెళ్దాం. లే, లే, పాపకి ఫ్రాకు తీసి వుంచు." అంటూ పాపని బాత్ రూములోకి తీసుకువెళ్ళింది.

"పిన్నిగారూ మీ ఋణం ఎలా తీర్చుకోవాలో..."

"ఋణాల సంగతి తరువాత. నేను చీర మార్చు కొస్తాను నువ్వు రెడీ అవు."

"అమ్మయ్య ఈ నెల పిన్నిగారు సహాయం చేస్తున్నారు.వచ్చే నెల ఎవరి సహాయమైనా అందించక పోడు ఆ భగవంతుడు నాకు. ఆ పోలియో డ్రాప్స్ కనిపెట్టిన మహానుభావుడెవరో, ప్రపంచంలో ఆయనకి చాలామంది ఋణపడి వున్నారు. ఆయన దయవల్ల నా నీలుకు పోలియో రాదు. నాలాగా కుంటిది కాదు. నాతల్లి చిన్నతనం పరుగులతో, ఆటలతో గడుస్తుంది. దీనికి భరతనాట్యం నేర్పిస్తాను." పాపకి ఫ్రాకు వేస్తూ సంతోషంగా అనుకుంది.

• • •

బస్‌లో సగం దూరం వెళ్ళాక, టిఫిన్ బాక్స్ మర్చిపోయిన సంగతి గుర్తుకొచ్చింది రఘుకు. పద్మతో అనవసరంగా కఠినంగా మాట్లాడేనేమో అనిపించింది. ఏమిటో ఒకొక్కప్పుడు జీవితంలో ఏదో పోగొట్టుకున్నట్లు అనిపిస్తుంది.

బయట అందంగా నడిచే ఆడపిల్లల్ని చూస్తే పద్మ అవిటికాలు జ్ఞాపకం వస్తుంది. అందమైన జంటలు నడుచుకుంటూ వెళ్తూంటే పద్మ గుర్తుకొస్తుంది. దాంతో తాను జీవితంలో ఏమీ పోగొట్టుకున్నాడో గుర్తుకొస్తుంది.చికాకు ఎక్కువయి పద్మను కోపంతో ఏదో అనేస్తాడు. తరువాత బాధ పడతాడు.

నీలిమ మీద ఎందుకింత కక్ష. పాపం, పసి కూన. దానికి పోలియో రాకూడదనేగా పద్మ తాపత్రయం. సహాయంచేయాల్సింది పోయి ఎగతాళి చేసాడు. తండ్రిగా తన బాధ్యత ఏమిటి?

కాలేజీ ఆవరణలో అడుగుపెట్టగానే, గుంపులు గుంపులుగా స్టూడెంట్సు, ముఖ్యంగా ఆడపిల్లలు గుస గుసలాడుకుంటున్నారు. స్టాఫ్ రూములో అంతా సీరియస్‌గా చర్చించుకుంటున్నారు. తెలుగు లెక్చరర్ శర్మగారిని విషయం ఏమిటని అడిగాడు రఘు.

"మరీ ఈ కాలం పిల్లలకు మానవత్వం తగ్గిపోతోందోయ్. ఎంత ర్యాగింగ్ అయితే మాత్రం ఆ కుంటిపిల్ల మీదనా వీళ్ళ ప్రతాపం. ఆ అమ్మాయిని డ్యాన్స్ చేయమని ఎగతాళి చేసి వెనకాల నుంచి ఆమె వూత కర్రను లాగేశాట్ట ఎవరో గడుగ్గాయి వెధవ. ఆ పిల్ల పడబోతుంటే పక్కనున్న ఆడపిల్లలిద్దరు పట్టుకున్నారట. ఆ పిల్ల ఏడుస్తూ ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్ళింది. ఈ రోజు వాడికి మూడింది. ఎంత కుంటి పిల్లయితే మాత్రం వాళ్ళకి మనసు వుండదా, నిజంగా నువ్వు దేవుడివి రఘు. తెలిసి, తెలిసి ఒక అవిటి పిల్లని చేసుకున్నావు. ఆమెకు ఒక జీవితాన్నిచ్చావు" భుజం తట్టాడు శర్మ ప్రేమగా.

నిజంగా నేను దేవుడ్నా? ప్రశ్నించుకుంటూ ఫైనల్ ఇయర్ బి.ఎస్.సి. క్లాస్‌కు వెళ్లాడు రఘు. క్లాస్ జరుగుతుండగా ప్యూన్ నోటీసు తెచ్చాడు. దాని సారాంశం ఇది.

"ఈ రోజు మధ్యాహ్నం లంచ్ అవర్ అయిన తరువాత 'సరస్వతీ మందిరం'లో ఎంటర్‌టైన్ మెంటు ప్రోగ్రాం వుంది అంతా తప్పకుండా హాజరు అవాలి. అది అయిన తరువాత అటెండెన్స్ తీసుకుంటాము. రాని వాళ్ళకి ఏభై రూపాయలు ఫైన్ వేయబడుతుంది."

స్టూడెంట్స్ అంతా గుసగుసలాడుకున్నారు. మిట్టమధ్యాహ్నం ఎంటర్‌టైన్ మెంట్ ప్రోగ్రాం ఏమిటో? ప్రొద్దుట జరిగిన సంఘటనతో ప్రిన్సిపాల్ హాట్‌హాట్‌గా వున్నారు. ఎవరికో మూడిందని అనుకుంటుంరటే, ఈ నోటీసు ఏమిటబ్బా అని ఆశ్చర్యపోయారు.

• • •

మధ్యాహ్నం లంచ్ అవర్ తరువాత అంతా "సరస్వతీ మందిరం" చేరారు. స్టూడెంట్స్ తోటి కళకళలాడుతోంది మందిరం. కానీ కిలకిలలు లేవు. నిశ్శబ్దంగా వుంది. అందరిలోఏదో గిల్టీ ఫీలింగ్. తుఫాను వచ్చేముందున్న ప్రశాంతత వుందా వాతావరణంలో. కాలేజీ ప్యూనులు ఆరు అందమైన పెయింటింగ్స్‌ను వేదిక మీద వరుసగా పెట్టారు. ఒక్కొక్క పెయింటింగ్‌లో ఒక్కొక్క కావ్యం గోచరిస్తోంది.అంత అందమైన పెయింటింగ్స్‌ను చూసి అంతా మనసులో మెచ్చుకున్నారు.

ప్రిన్సిపాల్‌హాల్లోకి రాగానే అంతా లేచి నుంచొని విష్ చేశారు. నవ్వుతూ వేదిక మీదకు వెళ్ళి మైక్ సరిచేసుకున్నారు ప్రిన్సిపాల్. స్టూడెంట్స్ గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి.

"గుడ్ ఆఫ్టర్ నూన్ మై చిల్డ్రన్, ప్రొద్దుట మన కాలేజీ క్యాంపస్‌లో జరిగిన సంఘటన చాలా న్యూన్యమైనది. సీనియర్స్ ఇంత అమానుషంగా ప్రవర్తిస్తారని అనుకోలేదు. ఎంటర్‌టైన్ మెంట్ ప్రోగ్రాంకి రమ్మని ఈ విషయంలోకి వెళ్తున్నాను కదూ, బై ది బై ఈ వేదిక మీద డిస్‌ప్లే చేసిన పెయింటింగ్స్ ఎలా వున్నాయో చెప్పండి."

"ఫెంటాస్టిక్! బ్యూటిఫుల్! మార్వలెస్! అద్భుతం!"

"ఓ.కె. ఓ.కె. మీ అందర్కీ నచ్చాయి కదా. ఈ కళాకృతులును రచించిన పెయింటర్‌ను చూడాలని వుందా మీకు?"

"యస్సార్" ఏక కంఠంతో అన్నారు స్టూడెంట్స్

"సరే చూపిస్తాను.అమ్మా వీణా రా తల్లీ."

వేదిక వెనకాల నున్న కర్టెన్‌ను నెట్టుకొని కర్ర ఆధారంగా నెమ్మదిగా నడుస్తూ వచ్చింది వీణ.

అంతా స్థబ్ధులయ్యారు.

"ఈ పెయింటింగ్స్ వేసిందెవరో చూశారు కదా? మీలో ఎవరో కాలు కుంటిదని గేలిచేశారే? ఆ పిల్ల వీణ. అమ్మాయి కాలు కుంటిదే కావచ్చు కాని చేతుల్లో మ్యాజిక్ వుంది. మ్యూజిక్ వుంది. బై ది బై ఈ అమ్మాయి వీణకదూ. తన వీణా నాదంతో మనలందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది. ఇదే ఈ రోజు ఎంటర్ టైన్ మెంటు ప్రోగ్రాం. అమ్మాయి వీణా-మోహన, కల్యాణి, కాపీ రాగాలు వాయించుతల్లీ."

ప్యూన్ వీణను తెచ్చి వేదిక మీద పెట్టాడు. కర్ర కిందపెట్టి నెమ్మదిగా కూర్చొని వీణకు నమస్కరించి వీణను ఒడిలోకి తీసుకుంది వీణ.

ఒక అరగంటసేపు సరస్వతీ మందిరంలో వీణానాదం ప్రతిధ్వనించింది. వాతావరణం చల్లబడింది. అంతా ఆ మధుర నాదంలో మునిగిపోయారు.

నెమ్మదిగా వీణా నాధం ఆగిపోయింది. కాలం మళ్ళీ నడిచింది. కరతాళధ్వనులతో హాలు ప్రతిధ్వనించింది. వీణను, అక్కడే కూర్చోమని ప్రిన్సిపాల్ మళ్ళీ వేదిక మీదకు వచ్చారు. మళ్ళీ స్టూడెంట్స్ గుండెల్లో గుబులు పుట్టింది.

"మీ అందరికీ వీణా నాదం నచ్చే వుంటుంది. భావి పౌరులు మీరు. మీకొక సంగతి చెపుతున్నాను. జీవితాంతం గుర్తుంచుకోండి. భగవంతుడు, వికలాంగులను, మూగవాళ్ళను, బుద్ధిమాంద్యత గల వాళ్లని, గ్రుడ్డివాళ్ళను ఎందుకు పుట్టిస్తాడో తెలుసా? అందరూ అనుకున్నట్లు వాళ్ళ పూర్వ జన్మ ఫలం వల్ల కాదు. మనలాంటి వాళ్ళ నైజాన్ని బయటపడేయడానికి, తమ చుట్టూ వున్న మానవుల ప్రవృత్తిని, వన్నెలను బయట పెట్టడాన్కి భగవంతుడు సృష్టించిన "గీటురాళ్ళు" వాళ్ళు. వాళ్ళని ఎగతాళిచేసి, హేళన చేసి అవమానపరిస్తే నీవన్నె తక్కువవుతుంది. నీది అసలు బంగారం కాదు. వాళ్ళని ఆదరించి, ప్రేమిస్తే నీవన్నె పెరుగుతుంది. భగవంతుడి దృష్టిలో నువ్వు అసలైన ఇరవైనాలుగు క్యారెట్ల బంగారానివి అవుతావు.

'సమాజంలో', వాళ్ళూ మనసున్న మనుషులే. వాళ్ళని ఆదరించి, వాళ్ళలో నిగూఢమైన కళలను, పైకి తీసుకురావాలి. అవిటి వాళ్ళకి చేయూతనిచ్చి జీవన సముద్రాన్ని దాటింప చేయాలి. కాని వాళ్ళ వూతకర్రలను లాగి సముద్రంలో పడేయకూడదు.

"మీలో ఎవరో ఈ రోజు వీణను 'టీజ్ చేసి ఆమెకు ఆధారమైన కర్రనులాగి ఆమెను పడేయబోయారు. అతనెవరో పశ్చాత్తాపంతో వీణకు సారీ చెప్పుకుంటే, అతనిలో నున్న మనిషిని గుర్తించి, నేను అలాంటి స్టూడెంట్ వున్నందుకు గర్విస్తాను. తన తప్పును కప్పి పుచ్చుకుంటే అతను "శాడిస్ట్" అంటాను.

"నేను అతను ఎవరో కనుక్కోగలను. ఎందుకంటే మన కాలేజీకి 'హీరో హొండా'ల మీద వచ్చే స్టూడెంట్స్‌ను వేళ్ళ మీద లెక్కపెట్ట వచ్చును.

"నేను అందరి ముందు ప్రామిస్ చేస్తున్నాను. తన తప్పు ఒప్పుకొని వీణకు క్షమాపణ చెప్పుకుంటే నేను అతన్ని మనస్ఫూర్తిగా క్షమిస్తాను. లేకపోతే అతనెవరో కనుక్కొని 'టి.సి' మీద, బ్యాడ్ అని రాసి 'టి.సి.' ఇచ్చి పంపుతాను. హ్యారీ అప్, కమాన్ మై బోయ్ తప్పు ఒప్పుకో అదే మానవత్వం. గొప్పతనం. అలా ఒప్పుకున్ననాడు అలాటి విద్యార్థి ఈ కళాశాలలో వున్నందుకు గర్విస్తాను" నవ్వుతూ అన్నారు ప్రిన్సిపాల్.

హాలంతా నిశ్శబ్దంగా వుంది. అంతా ఒకళ్ళ ముఖాలు ఒకళ్లు చూసుకుంటున్నారు. ఓ నిముషం తరువాత ఒక ఫైనల్ ఇయర్ స్టూడెంట్ నెమ్మదిగా తలవంచుకొని వేదిక దగ్గిరకు వచ్చాడు. అతను ప్రకాష్.

"సారీ సర్! నేనే ఆ తప్పు చేశాను. మీరేం శిక్ష వేసినా అనుభవిస్తాను. ఆమె కాళ్ళు పట్టుకోమన్నా పట్టుకుంటాను. చివరికి మిస్ వీణ ఒప్పుకుంటే, మా తల్లిదండ్రులను ఒప్పించి ఆమెని పెళ్లి చేసుకుంటాను." పశ్చాత్తాపంతో అంటున్న అతన్ని ఆపారు ప్రిన్సిపాల్.

"స్టాప్, స్టాప్, నువ్వు తప్పు ఒప్పుకున్నావు. ఐ యామ్ రియల్లీ హేపీ. ఇది సినిమా కాదు. జీవితం, మైడియర్ బోయ్. నీది. యంగ్ బ్లడ్. ఆవేశం ఎక్కువ. వీణ ఒప్పుకుంటే నువ్వు పెళ్ళి చేసుకుందామనే నిశ్చయనికొచ్చావు. బట్ ఇట్ ఈజ్ టూ లేట్. ఎందుకంటే ఆమె మిస్ వీణ కాదు. మిసెస్ వీణా వేణుమాధవ్. మూడు నెలల క్రితం రామనవమి ఉత్సవాల్లో, ఈమె వీణా నాదానికి ముగ్ధుడైన, మా వేణు పెళ్ళిచేసుకున్నాడు. వీణ నా కోడలు" నవ్వుతూ వీణను చూశారు. సిగ్గులో తల వంచుకుంది వీణ.

అమ్మో! ప్రిన్సిపాల్ గారి కోడల్నా తాను ఏడిపించింది. భయంతో ప్రకాష్ గుండె ఝల్లుమంది.

"సారీ సార్ నన్ను క్షమించండి. మిసెస్ వీణా మాధవ్ నన్ను మన్నించండి." సన్నగా వణుకుతూ అన్నాడు.

నవ్వుతూ భుజం తట్టారు ప్రిన్సిపాల్."ఛ. ఛ. ఎందుకలా భయపడుతున్నావు. నీకు ఒక చిన్న లెసన్. ఫ్యూచర్‌లో ఎవర్నీ టీజ్ చేయకు. మానవత్వం నేర్చుకో. సరేనా. ఇదిగో మా అబ్బాయి వచ్చాడు" అన్నారు.

అందరి దృష్టి గుమ్మం దగ్గిర నుంచున్న వేణుమాధవ్ మీద పడింది. అందంగా, హుందాగా నడుస్తూ వేదిక ఎక్కి వీణకి చేయూతనిచ్చి ఆమెను నడిపించుకొని వేదిక దిగాడు. ప్రొఫెసర్ వేణు మాధవ్. ఆడపిల్లలంతా వీణ అదృష్టాన్ని మెచ్చుకున్నారు.

•••

సాయంత్రం ఇంటికి బయలు దేరిన రఘుకు. పదే పదే ప్రిన్సిపాల్‌గారి మాటలు విన్పిస్తున్నాయి. 'గీటు రాళ్ళు'. 'గీటురాళ్ళు'

తాను ఒక వికలాంగురాలిని పెళ్ళి చేసుకున్నాడే కాని ఆమెను సరిగ్గా ఆదరించలేక పోతున్నాడు. ఆమెలోని అవిటితనం ఆమె చేతకాని తనంగా తీసుకొని ఆమెను చీత్కరిస్తున్నాడు. పద్మ తనను ఏం కోరింది? నగలు, చీరలు, సినిమాలు, షికార్లా కావు. తనకు చేతనయినంత పని చేస్తోంది. శుచిగా శుభ్రంగా యింటిని తీర్చిదిద్దుతున్నది. సమయం దొరికినప్పుడు వాళ్ళకీ, వీళ్ళకి ఎంబ్రాయిడరీ చేసి పెట్టుంది. చీరల మీద పెయింటింగ్స్ వేస్తుంది.. చిన్నప్పటినుంచి తాను పద్మని చూస్తున్నాడు. తానే కోరి చేసుకున్నాడు కాని ఎందుకు ఆదరించలేక పోతున్నాడు?

తలుపు తీసి, ఎదురుగా చేతులలో ప్యాకెట్లు పట్టుకొని, నవ్వుతున్న భర్తను చూసి ఆశ్చర్య పోయింది.

"పద్మా, కుర్చీల మీదకి, గలీబులకి క్లాత్ కావాలన్నావుగా తెచ్చాను. ఇవి ఫాబ్రిక్ పేయింట్స్ బ్రష్‌లు: నీలూకు పోలియో డ్రాప్స్ వేయించావా? సారీ ప్రొద్దుట చికాకులో ఏదో అన్నాను" మూ విప్పి వరండాలో పెట్టూ అన్నాడు.

"పార్వతమ్మ పిన్ని పాపను ఎత్తుకొన్నారు. ఇద్దరం కలిసి ఆటోలో వెళ్ళి డ్రాప్స్ వేయించాము. బావా, సారీ ఏమండీ, మన డాక్టరమ్మ ఏమన్నారో తెలుసా, నీలూ ఫీచర్స్ బాగావున్నాయిట. మంచి డ్యాన్సర్ అవుతుందిట. మన నీలూకు మంచి భవిష్యత్తు వుంది. మన నీలూను పరుగుల రాణి పి.టి. ఉష అంతదాన్ని చేద్దాం. నాట్యమయూరి పద్మా సుబ్రమణ్యం అంతదాన్ని చేద్దాం" పారవశ్యంగా అంది పద్మ.

"నాట్యం అంటే గుర్తుకొచ్చింది. రేపు మ్యూజిక్ కాలేజి లెక్చరర్ మధుమతి గారు వస్తారు. వారానికి మూడు క్లాసులుతీసుకొని నీకు సంగీతం నేర్పుతారు. నువ్వు నేర్చుకుంటే పాపకి మూడేళ్ళు రాగానే నువ్వే నేర్పవచ్చు." ప్యాకెట్‌లోంచి కనకాంబరాల మాల తీస్తూ అన్నాడు రఘు.

తన ఉనికిని తానే నమ్మలేకపోయింది. "బావా, నిజంగానా, నా మీద కోపం పోవడానికి కారణం ఎవరు బావా, నీలూనా?"

"గీటు రాళ్ళ మీద, వన్నె తగ్గకుండా భగవంతుడి కృప పొందాలి పద్మా అందుకు" కనకాంబరాలను పద్మ తలలో తురిమాడు.

"ఊ, ఊ, అత్తాత్త" పాక్కుంటూ వచ్చి తండ్రి కాళ్ళకు వచ్చి చుట్టుకుంది నీలిమ.

"నీలూ, నా బంగారు తల్లీ, నాట్యమయూరి"" నీలును ఎత్తుకొని ముద్దులతో ముంచెత్తుతూ అన్నాడు రఘు.